సాక్షి నల్లగొండ


శనివారం । 6 । ఏప్రిల్ । 2024



కాంగ్రెస్ అసమర్థతతోనే కరువు
కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతతోనే రాష్ట్రంలో కరువు తీవ్రత పెరిగిందని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు.
- IIలో



చెరువులు, కుంటలు నింపాలి
సాగర్ ఎడమకాల్వ నీటితో చెరువులు, కుంటలు నింపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రంగారెడ్డి అన్నారు.
- IIలో



న్యూస్‌రీల్

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

- ఎస్పీ చందనా దీప్తి



నల్లగొండ క్రైం: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ చందనా దీప్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ, రాష్ట్ర రహదారుల్లో ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించామని పేర్కొన్నారు. బ్లాక్ స్పాట్లు, మూలమలుపుల వద్ద లైటింగ్‌తో పాటు రేడియం స్టిక్కర్లు, బారికేడ్లు, వేగ నియంత్రణ బోలర్స్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. రాత్రి సమయాల్లో రోడ్లపై వాహనాలు నిలపవద్దని, ఏదైనా సమస్య వచ్చి వాహనాలు నిలిపితే వెంటనే పెట్రోలింగ్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. వాహనదారులకు రోడ్డు ప్రమాదాల నివారణ పట్ల అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

టెన్త్ మూల్యాంకనం.. వేగవంతం

నల్లగొండ: పదో తరగతి వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం వేగవంతమైంది. ఈనెల 3న నల్లగొండలో మూల్యాంకనం ప్రారంభించగా విధులు కేటాయించిన ఉపాధ్యాయులు పూర్తి స్థాయిలో హాజరు కాలేదు. దీంతో విద్యాశాఖ నోటీసులు జారీ చేయడంతో శుక్రవారం అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు మూల్యాంకనానికి హాజరయ్యారు. సెలవు దినాల్లోనూ మూల్యాంకనం చేసి త్వరగా పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

పెద్దఅడిశర్లపల్లి: సాగర్ నీటిమట్టం తక్కువగా ఉన్న నేపథ్యంలో జంటనగరాలకు మాత్రమే తాగు నీరు విడుదల చేస్తున్నామని నీటిని వృథా చేయకుండా రైతులు పొదుపుగా వాడుకోవాలని ఏఎమ్మార్పీ డివిజన్ -4 ఈఈ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని ఏఎమ్మార్పీ పరిధిలోని ప్రధాన కాలువ, ఏకేబీఆర్, పుట్టంగండి పంపుహౌజ్‌లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పుట్టంగండి పంపుహౌజ్ లీకేజీలను అరికట్టేందుకు చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రస్తుతం ప్రధాన కాలువకు 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట డీఈ నాగయ్య, ఏఈలు శిల్ప, శ్రావణ్‌కుమార్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని ధర్నా



ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

కొండమల్లేపల్లి : నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పారిశుద్ధ్య కార్మికులు శుక్రవారం కొండమల్లేపల్లి చౌరస్తా వద్ద ధర్నా చేపట్టారు. పంచాయతీ ఉద్యోగ కార్మికుల రాష్ట్ర అధ్యక్షుడు యజ్ఞనారాయణ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు విధులు బహిష్కరించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు వచ్చే చాలిచాలని వేతనాలతో జీవనం గడుపుతున్నారని, తక్షణమే పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోట్ల సతీష్, వెంకటయ్య, అలివేలు, పలువురు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ జిల్లాలో 43 డిగ్రీల ఉష్ణోగ్రత దాటిన గ్రామాలు	గ్రామం	గరిష్ఠం								
	మాడ్గులపల్లి	43.5	కనగల్	43.4	బుగ్గబాయిగూడ	43.3	గుర్రంపోడు	43.2	వెలుగుపల్లి	43.1
	గూడపూర్	43.5	తడకమళ్ల	43.4	టీక్యాతండా	43.3	పుల్లెంల	43.2	ముల్కచర్ల	43.0
	దామరచర్ల	43.4	పులిచర్ల	43.3	జూనూతుల	43.3	చండూరు	43.2		
	ఇబ్రహీంపేట	43.4	మేడ్లవాయి	43.3	సింగరాజుపల్లి	43.2	నల్లగొండ	43.1		
			మాటూర్	43.3	నాంపల్లి	43.2	రేగులగడ్డ	43.1		

నింగి నుంచి నిప్పులు!

43.5 డిగ్రీలకు పెరిగిన ఉష్ణోగ్రతలు



రాష్ట్రంలోనే నల్లగొండ జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదు

- జిల్లాలోని 20 ప్రాంతాల్లో 43 డిగ్రీలకు పైగానే..
- అప్రమత్తమైన యంత్రాంగం.. వడదెబ్బ జాగ్రత్తలు, కార్యాచరణపై దృష్టి
- ఎండ వేడి వ్యాధులపై టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి జిల్లాలో ఎండలు మండుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. శుక్రవారం జిల్లాలో ఉష్ణోగ్రత 43.5 డిగ్రీల సెల్సియస్‌కు చేరింది. ఉదయం 10 గంటలకే కర్ఫ్యూ వాతావరణం నెలకొంటోంది. ఎండలకు వడగాల్పులు తోడు కావడంతో ప్రజలు అల్లాడుతున్నారు. రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రత నల్లగొండ జిల్లాలోనే నమోదైంది. 18 మండలాల్లోని 20 గ్రామాల్లో ఉష్ణోగ్రత 43 డిగ్రీలు దాటిపోయింది. మాడుగులపల్లి మండల కేంద్రంతోపాటు మునుగోడు మండలం గూడాపూర్‌లో 43.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కాగా, దామరచర్ల మండల కేంద్రం, అనుముల మండలం ఇబ్రహీంపేట, కనగల్ మండల కేంద్రం, మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామాల్లో 43.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని, జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అధికారులు సూచిస్తున్నారు.

50 డిగ్రీలకు పెరిగే ప్రమాదం

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పగటిపూట ఉష్ణోగ్రతలు 50 డిగ్రీలకు పెరిగే ప్రమాదం ఉంది. ఈ మేరకు వాతావరణ శాఖ అధికారులు అంచనా వేసినట్లు నల్లగొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొండల్‌రావు పేర్కొన్నారు. ఇప్పటివరకు తీవ్రమైన వేడిగాలులకు సంబంధించి ముందు జాగ్రత్త చర్యలకు తీసుకోవాల్సిన అవసరం వెల్లడించారు.

అప్రమత్తమైన యంత్రాంగం

జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రజలు తీవ్రమైన వేడిగాలుల వల్ల వడదెబ్బకు గురికాకుండా అవగాహన కల్పించాలని కలెక్టర్ దాసరి హరిచందన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వేసవిలో వచ్చే సంబంధిత వ్యాధులపై దృష్టి సారించాలని వైద్య ఆరోగ్య శాఖకు సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ వేసవిలో అప్రమత్తంగా ఉండాలని, మున్సిపాలిటీలు, పంచాయతీల్లో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు.

జాగ్రత్తలు అవసరం



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరిచందన, అధికారులు

వడదెబ్బకు గురికాకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలి. వడదెబ్బ తాకిన వారి విషయంలో చేపట్టాల్సిన చర్యలకు సంబంధించిన పలు అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, నేషనల్ హెల్త్ మిషన్ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రూపొందించిన కరపత్రాన్ని, వాల్‌పోస్టర్లను కలెక్టర్ దాసరి హరిచందన శుక్రవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు.

టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు

ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు, ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకునేందుకు జిల్లా స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీని కలెక్టర్ దాసరి హరిచందన ఏర్పాటు చేశారు. శుక్రవారం కమిటీతో ఆమె భేటీ అయ్యారు. అదనపు కలెక్టర్ పూర్ణచందర్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డీఆర్‌వో రాజ్యలక్ష్మీ, ఇతర అధికారులతో సమీక్షించి సూచనలు చేశారు. ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలన్నారు. సంక్షేమ హాస్టళ్ల ,పాఠశాల, కళాశాల విద్యార్థులలో వడదెబ్బ పై అవగాహన కల్పించాలని, పని ప్రదేశాల్లో కూలీలకు తాగు నీరు, నీడ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఉపాధి కూలీలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద పనిచేసే వారి కోసం తాగునీరు నీడ ఏర్పాటు చేయాలని, మూగ జీవాల కోసం నీటి తొట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు.

వడదెబ్బ లక్షణాలు

డీహైడ్రేషన్, వాంతులు, విరేచనాలు, శరీర ఉష్ణోగ్రతలు పెరగడం, చెమట పట్టకపోవడం, వణుకు పుట్టడం, మగత నిద్ర లేదా కలవరింత, ఫిట్స్ లేదా పాక్షికంగా అపస్మార స్థితికి వెళ్లడం వడదెబ్బ లక్షణాలు. వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు తగ్గిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

వడదెబ్బ తాకితే చేపట్టాల్సిన చర్యలు

వడదెబ్బ తాకిన వారిని వెంటనే నీడ కలిగిన చల్లని ప్రదేశానికి తరలించాలి. చల్లని నీటిలో ముంచిన తడిగుడ్డతో శరీరం తుడవాలి. ఫ్యాన్ గాలి, చల్లని గాలి తగిలేలా చూడాలి. ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్ ద్రావణం తాగించాలి. వాంతులు, విరేచనాలు వంటివి సంభవించినా వైద్యులను సంప్రదించాలి. వడదెబ్బతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన రోగికి నీరు తాగించవద్దు. వీలైనంత త్వరగా దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స చేయించాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలివీ..

- ఉదయం సాయంత్రం సమయాల్లోనే బయటకు వెళ్లాలి.
- బయటికి వెళ్లినప్పుడు తప్పనిసరిగా ఎండ వేడిమి తగలకుండా పలుచనైన, వదులుగా ఉండే వస్త్రాలు ధరించాలి.
- రోజుకు కనీసం 15 గ్లాసుల నీటిని తాగాలి. నీరు, పళ్ల రసాలు, కొబ్బరి నీరు, ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి.
- భోజనం మితంగా తీసుకోవాలి. మాంసాహారం తీసుకోవద్దు.
- ఇంటిని ఫ్యాన్ వేసి చల్లగా ఉంచుకోవాలి.
- చల్లని రంగు పానీయాలను తీసుకోద్దు.
- రోడ్లపై ఉండే కలుషిత ఆహారం తీసుకోవద్దు. మద్యం సేవించవద్దు.

అప్రమత్తంగా ఉన్నాం



వేసవి ఎండల పట్ల అప్రమత్తంగా ఉన్నాం. జిల్లాలో 2లక్షలకు పైగా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచాం. వడదెబ్బకు గురైన వారికి ప్రథమ చికిత్స చేసేందుకు ఆశా వర్కర్ల వద్ద 50 ప్యాకెట్లు, ఏఎన్‌ఎంల వద్ద 100 ప్యాకెట్లు, పీహెచ్‌సీలలో 2 వేల చొప్పున ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాం. రేషన్ డీలర్లు, ఉపాధి పనులు చేసే వారి వద్ద, అంగన్‌వాడీల వద్ద, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాం. సెలైన్ బాటిల్లు అవసరమైన మందులను అన్ని పీహెచ్‌సీలలో అందుబాటులో ఉంచాం. మండల స్థాయిలో తహసీల్దార్, ఎస్‌ఐ, మెడికల్ ఆఫీసర్‌తో కలిపి కమిటీలను ఏర్పాటు చేశాం.

– అనిమల్ల కొండల్‌రావు, డీఎంహెచ్‌ఓ

నేటి కాంగ్రెస్ సభకు తరలిరండి



మాట్లాడుతున్న గుమ్ముల మోహన్‌రెడ్డి

నల్లగొండ: తుక్కుగూడలో శనివారం జరిగే కాంగ్రెస్ పార్టీ జన జాతర బహిరంగ సభకు తరలివచ్చి జయప్రదం చేయాలని ఆ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపు మేరకు నల్లగొండ నియోజకవర్గం నుంచి మధ్యాహ్నం 2గంటలకు పదివేల మందితో జన జాతరకు తరలి వెళ్లనున్నట్లు తెలిపారు. ఈ సభలో రాహుల్‌గాంధీ ప్రసంగిస్తారన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, ఎంపీపీ మనిమద్ది సుమన్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్,పాశం సంపత్‌రెడ్డి, మాడుగులపల్లి జెడ్పీటీసీ సైదులు, నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు నివాళి



జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ హరిచందన, అధికారులు

నల్లగొండ: దేశ మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడులకను నల్లగొండలోని కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కలెక్టర్ దాసరి హరిచందన పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ టి.పూర్ణచందర్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డీఆర్‌ఓ రాజ్యలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ హరిచందన




మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

నల్లగొండ: ప్రజలు వడదెబ్బకు గురికాకుండా వైద్యారోగ్య శాఖ అధికారులు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన అన్నారు. ఎండ సంబంధ వ్యాధులపై శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఇప్పటికే 43.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయన్నారు. ప్రజలు బయటికి వెళ్లినప్పుడు ఎండ తగలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఉపాధి కూలీలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద పనిచేసే వారికి తాగునీరు, నీడ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. లోక్‌సభ ఎన్నికలు మేలో ఉన్నందున ఓటు వేయడానికి వచ్చే వారికి టెంట్లను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారులు హాస్టళ్లకు వెళ్లి పిల్లలు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలను తెలియజేయాలన్నారు. అనంతరం ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, నేషనల్ హెల్త్ మిషన్ తెలంగాణ సంచాలకుల ద్వారా రూపొందించిన కరపత్రాన్ని, వాల్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ టి.పూర్ణచందర్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డీఆర్‌ఓ రాజ్యలక్ష్మి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండల్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో ఫోన్ ట్యాపింగ్ ప్రకంపనలు

- ఇద్దరు కానిస్టేబుళ్లను అదుపులోకి తీసుకున్న దర్యాప్తు బృందం
- మరో హెడ్ కానిస్టేబుల్ నుంచి వాంగ్మూలం సేకరణ



నల్లగొండ క్రైం: రాష్ట్ర వ్యాప్తంగా అలజడి సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం జిల్లాలోనూ ప్రకంపనలు రేపుతోంది. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్న బృందం జిల్లా కేంద్రంలోని టాస్క్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న ముగ్గురు పోలీసులను విచారించి ఒకరి నుంచి వాంగ్మూలం తీసుకుని ఇద్దర్ని హైదరాబాద్ తీసుకెళ్లినట్లు తెలిసింది. ఇందులో కీలకంగా వ్యవహరించిన ఉన్నతాధికారుల వివరాలతోపాటు వారు ఇచ్చిన ఆదేశాలతో ఎక్కడ నగదును పట్టుకున్నారు. ఎవర్ని బెదిరించి వసూళ్లకు పాల్పడ్డారనే వివరాలను దర్యాప్తు అధికారులు రాబట్టారు. ఆ ముగ్గురు పోలీసులను విచారించిన సమయంలో వారి సంపాదన, అక్రమఆస్తులు, వారిజీవన విధానం, కుటుంబ నేపథ్యంపై ఆరా తీసినట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులనే తప్పుదోవ పట్టించి అక్రమ సంపాదనతో భారీ ఎత్తున స్థిరాస్తులు కూడబెట్టినట్లు అధికారుల దృష్టికి వెళ్లింది. దర్యాప్తు బృందం విచారించిన ముగ్గురు పోలీసులు మునుగోడు ఉప ఎన్నికల్లోనూ కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. మునుగోడు ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి అనుకూలంగా ఓ కీలక పోలీసు అధికారితో పాటు మరికొందరు అండగా నిలిచి రూ.100 కోట్లు తమ వాహనాల్లో తరలించినట్లు చర్చ జరుగుతోంది. మునుగోడు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు లక్ష్యంగా కాంగ్రెస్ నేతలు, వారి ముఖ్య అనుచరుల ఫోన్లు ట్యాపింగ్ చేసి వారి కదలికలపై నిఘా ఉంచి ఎక్కడికక్కడ కాంగ్రెస్ నాయకులను కట్టడి చేశారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. జిల్లా కేంద్రంలో ఫోన్ ట్యాపింగ్ కోసం ప్రత్యేక వార్ రూమ్ ఏర్పాటు చేసి కాంగ్రెస్ ముఖ్య నాయకులతో పాటు రైస్ మిల్లర్ యజమానులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు సిమెంట్ పరిశ్రమల యజమానుల ఫోన్లను ట్యాప్ చేసినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీకి ఆర్థిక సహకారం అందించే నాయకులు, వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని ట్యాపింగ్ వ్యవహారాన్ని నడిపించారు. నల్లగొండ జిల్లా కేంద్రంతో పాటు మిర్యాలగూడలోను రైస్ మిల్లు యజమానుల ఫోన్ ట్యాపింగ్ చేశారని చర్చ జరుగుతోంది. ఇద్దరు డీఎస్పీ స్థాయి ప్రత్యేక అధికారులు మేళ్లచెరువులో ఉండి ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన విషయమై చర్చ జరగ్గా కంపెనీకి జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో వ్యతిరేకంగా మాట్లాడి వారి నంబర్లను హైదరాబాద్ నుంచి ట్యాపింగ్ చేశారని భావించారు. కాగా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులను వారి ముఖ్య అనుచరులను లక్ష్యంగా ట్యాపింగ్ చేసి ఆర్థిక వనరులు, వారి కదలికలపై నిఘా వేసినట్లు తెలుస్తోంది.

'సాగర్'లో బీఆర్‌ఎస్‌కు బిగ్ షాక్

- పార్టీకి, పదవులకు పలువురు నాయకులు, ప్రజాప్రతినిధుల రాజీనామా
- త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో చేరుతామని ప్రకటన

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. నియోజకవర్గంలోని వివిధ మండలాలు, మున్సిపాలిటీల పరిధిలోని ఆ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు వారివారి పదవులకు, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామాలు చేశారు. శుక్రవారం నందికొండలోని రెడ్డిసంక్షేమ సంఘం ఫంక్షన్‌హాల్‌లో పెద్దవూర మండల జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సమావేశమైన నాయకులు గ్రామీణ స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు పార్టీ పదవులు, జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ తదితర పదవులకు పార్టీకి రాజీనామాలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆరుగ్యారంటీ పథకాలతో మండలాలు, మున్సిపాలిటీల్లో సమగ్రాభివృద్ధి జరుగుతుందనే నమ్మకంతో త్వరలోనే మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, నల్లగొండ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి, సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నట్లు ప్రకటించారు. పదవులకు రాజీనామా చేసిన వారిలో అనుముల జెడ్పీటీసీ, జెడ్పీ వైస్‌చైర్మన్ ఇరిగి పెద్దులు, పెద్దవూర మండల జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, గుర్రంపోడు ఎంపీపీ మంచికంటి వెంకటేశ్వర్లు, త్రిపురారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, నందికొండ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కర్ణఅనూషారెడ్డి, కర్ణ బ్రహ్మానందరెడ్డి, వైస్‌చైర్మన్ మంద రఘువీర్ (బిన్ని), పార్టీ మున్సిపల్ అధ్యక్ష, కార్యదర్శులు బత్తుల సత్యనారాయణ, కాటు కృష్ణ, గుజ్జల కొండలు, శీలం వెంకటయ్య, కందెల వెంకటేశ్వర్లు, పెద్దవూర మండలం నుంచి ఎంపీటీసీలు గోనె వివేక్‌రావు, రమావత్ శ్రీరాములు, మార్కెట్‌కమిటీ మాజీ వైస్‌చైర్మన్ ఆడెపు రామలింగయ్య, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కర్నాటి వెంకట్‌రెడ్డి(ముని), బోయ నరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఉన్నారు.



రాజీనామాలు చేసిన అనంతరం విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి



రైతు సత్యాగ్రహ దీక్షలో మాట్లాడుతున్న మురళీధర్‌రావు

- తక్షణమే రూ.2లక్షల రుణమాఫీ చేయాలి
- రైతు సత్యాగ్రహ దీక్షలో బీజేపీ జాతీయ నేత మురళీధర్‌రావు

నల్లగొండ టూటౌన్: ప్రజా, రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు ఈ లోక్‌సభ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని బీజేపీ జాతీయ నాయకుడు పి.మురళీధర్‌రావు అన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లగొండలోని గడియారం సెంటర్‌లో నిర్వహించిన రైతు సత్యాగ్రహ దీక్షకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తాము అధికారంలోకి రాగానే డిసెంబర్ 9న రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి 100 రోజులు దాటినా ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతు భరోసా కింద రూ.15 వేలు అని నమ్మక ద్రోహం చేసిందన్నారు. క్వింటా ధాన్యానికి రూ.500 బోనస్ అని దానిఊసే లేదన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులపై ప్రేమ ఉంటే రూ.2లక్షల రుణమాఫీ చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. ఎండిన పంటలకు ఎకరాకు రూ.25 వేల పరిహారంతోపాటు ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా మంత్రులు మిల్లర్లను బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, నూకల నర్సింహారెడ్డి, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, బండారు ప్రసాద్, లాలూనాయక్, కంకణాల నివేదితరెడ్డి, పోతెపాక సాంబయ్య, దాయం భూపాల్‌రెడ్డి, పోతెపాక లింగస్వామి, పకీరు మోహన్‌రెడ్డి, కంకణాల నాగిరెడ్డి, పెరిక మునికుమార్, వంగూరి రాఖీ, రావెళ్ల కాశమ్మ తదితరులు పాల్గొన్నారు.

నృసింహుడికి లక్ష పుష్పార్చన



లక్షపుష్పార్చన చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో లక్షపుష్పార్చన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రధానాలయ ముఖమండపంలో ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలతో దివ్యమనోహరంగా అలంకరించారు. అర్చకులు, వేద పండితులు సహస్రనామ పఠనాలు పఠిస్తూ వివిధ రకాల పూలతో లక్ష పుష్పార్చన చేశారు. తెల్లవారుజామున సుప్రభాత సేవ, నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఉదయం సుదర్శన నారసింహ హోమం, నిత్యకల్యాణం తదితర పూజలు నిర్వహించారు.

క్లుప్తంగా

గీత కార్మికుడికి తీవ్రగాయాలు

రామన్నపేట : ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం మండలంలోని మునిపంపుల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కూనూరు పాండు గ్రామ శివారులో తాటిచెట్టు ఎక్కి కల్లుతీస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడ్డాడు. దీంతో నడుము, వెన్నుపూస, ఎడమకాలుకు బలమైన గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

17క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం

దేవరకొండ : ఓఇంట్లో అక్రమంగా నిల్వఉంచిన 17క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని శుక్రవారం పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సభావత్‌తండాకు చెందిన కొండల్ అనే వ్యక్తి ఇంట్లో పీడీఎస్ బియ్యం అక్రమంగా నిల్వఉంచారన్న విశ్వసనీయ సమాచారం మేరకు తండాలో తనిఖీ నిర్వహించి స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ పేర్కొన్నారు.

బంగారం, నగదు చోరీ

పెన్‌పహాడ్ : గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళం పగులగొట్టి 8తులాల బంగారంతోపాటు కొంత నగదును చోరీ చేశారు. ఈ ఘటన మండలంలోని అనంతారం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గొర్ల అంజయ్య గురువారం మధ్యాహ్నం ఇంటి తాళం వేసి సూర్యాపేటకు వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. దీంతో అతడు ఇంట్లోకి వెళ్లి బీరువాలో చూడగా 8తులాల బంగారంతోపాటు, నగదును దుండగులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. వెంటనే బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



అబ్దుల్‌అలీం మృతదేహం

కోదాడరూరల్ : విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని రామాపురం క్రాస్‌రోడ్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రెడ్లకుంట గ్రామానికి చెందిన మహ్మద్ అబ్దుల్ అలీం తాపీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అలీం రామాపురం క్రాస్‌రోడ్‌లో గల ఓ ఇంటి నిర్మాణ పనికి వెళ్లాడు. అక్కడ ఇంటిపై పనిచేస్తున్న క్రమంలో అతడి వద్ద ఉన్న అల్యూమినియం బద్దె పనిచేసే ఇంటి పైనుంచి వెళ్తున్న 11కేవీ విద్యుత్ తీగలకు ప్రమాదవశాత్తు తగిలింది. దీంతో అలీం అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై మృతుడి తండ్రి అబ్దుల్‌హై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

భువనగిరి క్రైం : వేర్వేరుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. మండలంలోని నమత్‌పల్లి గ్రామానికి చెందిన సురుపంగా కృష్ణయ్య భువనగిరి వెళ్లి గ్రామానికి వస్తుండగా నల్లగొండ రోడ్‌లోని పెట్రోల్‌బంక్ వద్ద వెనుక నుంచి వచ్చిన ఓ కారు ఢీకొట్టింది. దీంతో కృష్ణయ్య తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. అదే విధంగా వలిగొండ మండలంలోని వెలువర్తి గ్రామానికి చెందిన గండికోట దుర్గయ్య తన ద్విచక్ర వాహనంపై భువనగిరి వచ్చి వలిగొండ వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఓ ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో దుర్గయ్య తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వ్యవసాయ బోరే.. చెరువుకు ఆదరువు!



వ్యవసాయ బోరు నుంచి పైప్‌లైన్ వేసి చెరువులోకి నీరు వదులుతున్న దృశ్యం



ఆత్మకూరు(ఎం): భూగర్భ జలాలు పెంచి ఆయకట్టు కింద వ్యవసాయ బోర్లకు, బావులకు నీరు అందించే చెరువు ఎండిపోతే.... అదే ఆయకట్టు కింద గల వ్యవసాయ బోరు ఇప్పుడు ఆ చెరువును నింపుతోంది. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం కప్రాయపల్లిలో పెద్ద చెరువు ఎండిపోయే దశకు చేరుకోవడంతో చెరువులోని చేపలను రక్షించుకోవడానికి, మూగ జీవాల దాహార్తిని తీర్చడం కోసం మత్స్య పారిశ్రామిక సంఘం ఆధ్వర్యంలో నెలకు రూ.3వేలతో వ్యవసాయ బోరును అద్దెకు తీసుకుని గత ఇరవై రోజుల నుంచి చెరువుకు నీరందిస్తున్నారు. మరో పది రోజుల పాటు నీరందించి చేపలను కాపాడుకుంటామని అధ్యక్షుడు జిల్లాల శ్రీను తెలిపారు.

కాంగ్రెస్ అసమర్థతతోనే కరువు

- ఇక్కడ వసూళ్లు.. ఢిల్లీకి ముడుపులు
- సాగు, తాగునీరందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

మిర్యాలగూడ : కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థతోనే రాష్ట్రంలో కరువు తీవ్ర పెరిగిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరావుతో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో రైతులు తమ పంటలు ఎండి ఆర్థికంగా నష్టపోయినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. రాష్ట్రంలో రైతులు పంటలకు ఎకరానికి రూ.20వేల నుంచి రూ.30వేల వరకు పెట్టుడులు పెట్టి సాగు చేయగా అవి ఎండిపోవడంతో పెట్టిన పెట్టుబడులు రాక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. ఎండిన పొలాలను మాజీ సీఎం కేసీఆర్ పరిశీలించగానే కాళేశ్వరం ప్రాజెక్టు పనికి రాదని చెప్పి సీఎం, మంత్రులు వెంటనే కాళేశ్వరం నీటిని ఎత్తిపోయించారని, ఎస్‌ఆర్‌ఎస్పీకి నీటిని వదిలారని అన్నారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రజల్లోకి వెళ్లేసరికి కాంగ్రెస్ ప్రభుత్వానికి వణుకు పుట్టిందన్నారు. నల్లగొండ జిల్లాలో నీరివ్వకుండా పాలేరు రిజర్వాయర్‌కు తాగునీటి కోసం నీటిని తరలించుకుపోతున్నా జిల్లా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి తాగునీరు అందించామన్నారు. ఇక్కడ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు వసూలు చేసి ఢిల్లీకి ముడుపులు పంపిస్తున్నారే తప్పా.. ప్రజల సాగు, తాగునీటి కష్టాలను తీర్చడంలో విఫలయ్యారని అన్నారు. రైతుబంధు, రూ.2లక్షల రుణమాఫీ, వరి ధాన్యానికి రూ.500 బోనస్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ నేడు అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు, దీక్షలు చేపట్టనున్నట్లు ఈ కార్యక్రమంలో రైతులు, బీఆర్‌ఎస్ అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, నాయకులు నామిరెడ్డి యాదగిరిరెడ్డి, మట్టపల్లి సైదులుయాదవ్, రవినాయక్, హాతీరాం, నర్సింహారెడ్డి, చౌగాని భిక్షం, ఎండీ.షోయబ్ ఉన్నారు.

రావి నారాయణరెడ్డి నమూనా విగ్రహం పరిశీలన

భువనగిరి రూరల్ : మండలంలోని బొల్లెపల్లి గ్రామంలో రావి నారాయణరెడ్డి సేవా సంస్థ ఆధ్వర్యంలో త్వరలో రావి నారాయణరెడ్డి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో మట్టితో తయారు చేసిన నమూనా విగ్రహాన్ని ఆ సంస్థ సభ్యులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విగ్రహంలోని పలు చేర్పులు, మార్పులకు సూచనలు చేశారు. పరిశీలించిన వారిలో సంస్థ అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీనివాస్, ముఖ్య సలహాదారులు భువనగిరి సత్యనారాయణ, నమూనా చిత్రం గీసిన భువనగిరి జ్యోత్స్న తదితరులు ఉన్నారు.



నమూనా విగ్రహాన్ని పరిశీలిస్తున్న సభ్యులు

మృతుడి వివరాలు లభ్యం

రామగిరి(నల్లగొండ) : తిప్పర్తి మండలంలోని బండవారిగూడెం వద్ద గురువారం లభించిన మృతదేహం వివరాలు తెలిశాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని బేగంపేట పాటిగడ్డకు చెందిన జోగిని యాదగిరి(38)కి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. యాదగిరి రెండు సంవత్సరాలుగా ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. దీంతో అతడి భార్య పిల్లలతో కలిసి తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. యాదగిరి తన తల్లి రాములమ్మ వద్ద ఉంటున్నాడు. తల్లి వద్ద ఉంటున్న యాదగిరి మద్యానికి బానిసయ్యాడు. రాములమ్మ మార్చి 30న బంధువుల వివాహానికి వెళ్లి ఏప్రిల్ 1న ఇంటికి వచ్చేసరికి యాదగిరి ఇంట్లో కనపించలేదు. మరుసటి రోజుకు కూడా రాకపోవడంతో బంధువుల వద్ద సమాచారం అడిగినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. గురువారం తిప్పర్తి మండలం బండవారిగూడెం వద్ద స్థానికులు గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, క్లూం టీమ్ మృతుడి వద్ద ఆధార్‌కార్డును పరిశీలించి బేగంపేట పోలీసుల ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. రాములమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ డి.రాజు తెలిపారు. శుక్రవారం మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అందరు ఉన్నా.. అనాథగా మృతి

- కుమారులు పట్టించుకోకపోవడంతో చెట్టు కిందే జీవనం
- కదలలేని స్థితిలో చీమలు పట్టి మరణించిన వృద్ధురాలు



మృతి చెందిన వృద్ధురాలు మన్నూరి సైదమ్మ

నేరేడుచర్ల : నవమాసాలు ఇద్దరు కొడుకులను మోసి పెంచి ఒక ఇంటివారిని చేసి చివరకు ఎవరూ లేని అనాథగా మృతి చెందింది ఓ తల్లి. ఈ సంఘటన శుక్రవారం నేరేడుచర్లలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మున్సిపాలిటీలోని విద్యానగర్‌కు చెందిన మన్నూరి సైదమ్మ(80)కు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు మన్నూరి కృష్ణయ్య, చిన్న కుమారుడు మన్నూరు బుద్దుడు. వారికి సైదమ్మ వివాహం చేయడంతో భార్యలతో వేర్వేరు కుటుంబాలుగా జీవనం సాగిస్తున్నారు. నాలుగు నెలల క్రితం సైదమ్మను ఇద్దరు కుమారులు తమ ఇంట్లోకి రాకుండా గెంటివేయడంతో విద్యానగర్‌లో రామాలయం ఎదురుగా ఉన్న ఓ చెట్టు కింద ఉండి అడుకుని తింటూ జీవనం కొనసాగిస్తుంది. ఈ క్రమంలో నేరేడుచర్లకు చెందిన వృద్ధాశ్రమ నిర్వాహకురాలు సావిత్రమ్మ సైదమ్మను తన వృద్ధాశ్రమానికి తీసుకెళ్లి బాగోగులు చూసుకుంటుంది. రెండు రోజుల క్రితం సైదమ్మ ఆరోగ్య పరిస్థితి సరిగా లేకపోవడంతో కుమారుల వద్దకు తీసుకెళ్లింది. దీంతో కుమారులు, కోడళ్లు వృద్ధాశ్రమం నిర్వాహకురాలు సావిత్రమ్మను తిడుతూ సైదమ్మను ఎక్కడి నుంచి తీసుకెళ్లావో అక్కడే వదిలేయమని హెచ్చరించారు. దీంతో సావిత్రమ్మ సైదమ్మను రామాలయం ఎదురుగా ఉన్న ఓ చెట్టుకింద వదిలివెళ్లింది. కథలేని స్థితిలో ఉన్న సైదమ్మ చెట్టుకింద పడుకొని ఉండడంతో ఆమెకు చీమలు పట్టి స్పృహలేని స్థితిలోకి వెళ్లింది. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. దీంతో సిబ్బంది సైదమ్మను చికిత్స నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందింది. అందరు ఉన్నా అనాథగా సైదమ్మ మృతి చెందడంతో పలువురిని కంటతడి పెట్టించింది. మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు కుమారులు రాకపోవడంతో వైద్యసిబ్బంది మండల పోలీసులకు సమాచారం అందించారు.

జాతీయ రహదారిపై కారు బోల్తా.. దగ్ధం

- ముగ్గురికి తీవ్ర గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం



ఆలేరు బైపాస్ రోడ్డులో మంటల్లో దగ్ధమైన కారు

ఆలేరురూరల్ : హైదరాబాద్ – వరంగల్ రహదారిపై ఆలేరు వద్ద కారు డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. ఆ వెంటనే మంటల చెలరేగడంతో కారు దగ్ధమైంది. హన్మకొండ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఆల్టో కారు శుక్రవారం ఉదయం ఆరున్న గంటల సమయంలో ఆలేరు బైపాస్ వద్దకు రాగానే అదుపు తప్పి డివైడర్‌ను దాటు కుంటూ అవతలి వైపు రోడ్డు దాటి పల్టీకొడుతూ పక్కన ఉన్న గుంతలో పడిపోయింది. కారులో మంటలు చెలరేగి కారు పూర్తిగా దగ్ధమైంది. కారు డ్రైవర్ వేణుగోపాల్ తోపాటు కారులో ప్రయాణిస్తున్న సోలేటి సుధాకర్ తన భార్య సోలేటి రేవతి, బంధువు సబితకు తీవ్ర గాయాలయ్యాయి. సబిత పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. పోలీసులు క్షతగాత్రులను ఆలేరు ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అంబులెన్స్‌లో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ అస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెంకటశ్రీను తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అనంతగిరి : ఇటీవల పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెంకట్రాంపురం గ్రామానికి చెందిన చిట్యాల చంద్రమౌళి(55) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఒంటరిగా జీవితాన్ని గడుపుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తిచెంది గత మంగళవారం రాత్రి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బంధువులు చికిత్స నిమిత్తం కోదాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో సూర్యాపేట జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతుడి కుమారుడు మురళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపారు.

బెల్ట్‌దుకాణాలపై పోలీసుల దాడులు

భువనగిరి క్రైం : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున భువనగిరిరూరల్ ఎస్‌ఐ వి.సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని ముత్తిరెడిగూడెంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న బెల్ట్‌దుకాణాలపై శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రాంపల్లి బక్కయ్య వద్ద 27బీర్‌బాటిల్స్, 7క్వార్టర్ బాటిళ్ల మద్యం సీజ్ చేసి అతడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామంలో ఎవరైనా మద్యం అమ్మితే వారిపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

సూర్యాపేట : రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పట్టణ పరిధిలోని రాయినిగూడెం సమీపంలో 7ఆర్ హోటల్ వద్ద 65వ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాయినిగూడెం సమీపంలో 55నుంచి 60సంవత్సరాలు, 5.8అడుగుల ఎత్తుగల ఓ వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోచంపల్లిని సందర్శించిన అధికారులు



ఇక్కత్ చీరను పరిశీలిస్తున్న ఫైనాన్స్ అడ్వైజర్ మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్ అధికారి అర్షిత్ గోపాల్



చేనేత వస్త్రాల తయారీని పరిశీలిస్తున్న అధికారి అర్షిత్ గోపాల్

భూదాన్‌పోచంపల్లి : చేనేత కళాకారుల, వ్యాపారుల స్థితిగతులు, చేనేత పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడానికి శుక్రవారం కేంద్ర ప్రభుత్వ అడిషనల్ సెక్రటరీ, ఫైనాన్స్ అడ్వైజర్ మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్, అర్షిత్‌గోపాల్, వీవర్ సర్వీస్‌సెంటర్ రీజినల్ డైరెక్టర్ అరుణ్‌కుమార్‌తో కలిసి పోచంపల్లిని సందర్శించారు, చేనేత గృహాలు, చేనేత సహకార సంఘం, సహకారేతర రంగంలో ఉన్న వస్త్ర దుకాణాలను, మగ్గాలపై తయారవుతున్న చేనేత వస్త్రాలను పరిశీలించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వారిని అడిగి తెలుసుకున్నారు. పథకాలలో మార్పులు, చేర్పులపై, కార్మికుల ఆర్థిక స్వావలంభనకు ఇతర పథకాలను అమలు చేయాలని స్థానిక చేనేత నాయకులు, కార్మికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టై అండ్ డై అసోషియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, మాజీ అధ్యక్షుడు తడక రమేశ్ మాట్లాడారు. పోచంపల్లి ఇక్కత్ ప్రింటెడ్ వస్త్రాలను అరికట్టాలని, పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కులో హెచ్‌టీటీఐ నెలకొల్పాలని, చేనేత మగ్గాల నిర్వహణకు రూ.25లక్షల వరకు ముద్ర రుణాలను ఇవ్వాలని కోరారు. అలాగే వర్క్ షెడ్ పథకాలను అమలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను తెలంగాణకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అందుకు అధికారులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. వారి వెంట పద్మశాలి చేనేత కార్మిక సంఘం అధ్యక్షురాలు మెరుగు శశికళ, రాపోలు శ్రీనివాస్, టైఅండ్ డై అసోషియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటితో చెరువులు, కుంటలు నింపాలి



గిరిజనులతో కలిసి ఖాళీ బిందెలతో నీటి కోసం వెళ్తున్న జూలకంటి రంగారెడ్డి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : సాగర్ ఎడమకాల్వ నీటితో చెరువులు, కుంటలు నింపి ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ మండలంలోని ఐలాపురం గ్రామంలో సాగర్ ఎడమకాల్వ నుంచి బిందెలతో నీటిని తెచ్చుకుంటున్న గిరిజన మహిళలతో కలిసి ఆయన ఆందోళన చేపట్టారు. అనంతరం ఎండిన ఐలాపురం చెరువులో కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భజలాలు పూర్తిగా పడిపోయాయని దీంతో సాగు, తాగునీటి సమస్య తీవ్రమైందన్నారు. వేసవికాలంలో భూగర్భజలాలు అడుగంటిపోవడంతో ఐలాపురం గిరిజన ప్రజలు రెండు కిలోమీటర్ల దూరం వెళ్లి సాగర్ ప్రధాన కాల్వ ద్వారా నీటిని తెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సాగర్ ఎడమకాల్వ ద్వారా పాలేరు రిజర్వాయర్‌కు తాగునీటి కోసం నీటిని తీసుకెళ్తున్నారని, అదేవిధంగా నల్లగొండ జిల్లాలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు సాగర్ మెయిన్ కాల్వ ద్వారా చుట్టుపక్కల చెరువులు, కుంటలను నింపాలన్నారు. ఎడమకాల్వ పరిధిలో ఉన్న లిఫ్టుల నుంచి నీటిని చెరువులకు, కుంటలకు మళ్లిస్తే భూగర్భజలాలు పెరుగుతాయని, దీంతో తాగునీటి ఎద్దడిని నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి రవినాయక్, పగిడోజు రామ్మూర్తి, నాగేశ్వర్‌నాయక్, శ్రీనునాయక్, వెంకటేశ్వర్లు, జగన్‌నాయక్, బాణావత్ నాగమ్మ, సునీత, లక్ష్మి, ఈరి, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆండాళ్ అమ్మవారికి ఊంజలి సేవ



అమ్మవారికి హారతినిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శుక్రవారం ఆండాళ్ అమ్మవారికి ఊంజలి సేవోత్సవం పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, ఆలయ తిరు, మాఢ వీధుల్లో సేవను ఊరేగించారు. ఆండాళ్ అమ్మవారి ఊరేగింపు సమయంలో మహిళా భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారిని అధిష్టించి ఊంజలి సేవోత్సవాన్ని చేపట్టారు. ఆండాళ్ అమ్మవారికి ఇష్టమైన నాథస్వరాన్ని వినిపించారు. అనంతరం హారతినిచ్చారు.

మాంసం దుకాణాల్లో తనిఖీలు

సూర్యాపేట : సూర్యాపేట పట్టణంలోని మార్కెట్ రోడ్డులో గల ఓ మాంసం దుకాణాల్లో జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ సంజయ్‌కృష్ణ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారుల ఫిర్యాదు మేరకు స్టాంపింగ్ లేని తూనీకలతో మాంసం విక్రయిస్తున్నారని గుర్తించి ఐదు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట తూనికలు కొలతల విభాగం అధికారి పర్వతం శ్రీధర్ తదితరులు ఉన్నారు.



మాంసం దుకాణంలో తనిఖీ చేస్తున్న జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ సంజయ్‌కృష్ణ

గంజాయి తరలిస్తున్న మహిళ అరెస్ట్

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఓ మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన చింతలపాలెం మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. చింతలపాలెం ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని జగ్గయ్యపేట మండలం ధర్మవరపుపాడుతండాకు చెందిన గుగులోతు విజయ కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. విజయ స్నేహితుల ద్వారా గంజాయి తాగడానికి అలవాటు పడింది. ఆమెకు రోజువారీగా చేసే కూలీ డబ్బులు సరిపోకపోవడంతో గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్మి డబ్బులు సంపాదించాలని ఓ మహిళ దగ్గర గంజాయి కొనుగోలు చేసి మేళ్లచెరువులోని మైహోం సిమెంట్ పరిశ్రమ కూలీలకు, ఇతరులకు విక్రయిస్తుంది. ఈ క్రమంలో గంజాయిని అమ్మేందుకు జగ్గయ్యపేట నుంచి గంజాయితో వస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు చింతలపాలెం బస్టాండ్ వద్ద ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకుని 200గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపారు.

పండ్ల తోటలకు పొంచి ఉన్న అగ్ని ప్రమాదాలు

- అనుముల ప్రాంతీయ ఉద్యానవన శాఖ అధికారి మురళి సూచనలు



తేనపల్లి తండాలో ఇటీవల కాలిన బత్తాయి తోట (ఫైల్)

గుర్రంపోడు : వేసవిలో పండ్లతోటలకు అగ్ని ప్రమాదాలు పొంచి ఉండి రైతులను కలవరపాటుకు గురిచేస్తాయి. 20 ఏళ్లపాటు దిగుబడులు ఇచ్చే బత్తాయి, నిమ్మలాంటి తోటలు అగ్ని ప్రమాదాలకు గురైతే రైతుకు ఆర్థికంగా కోలుకోవడం కష్టమే. కరువుకు తోడైన అగ్ని ప్రమాదాలు రైతుకు గోరుచుట్టు రొకటి పోటుగా మారి తీవ్ర నష్టం కల్గిస్తాయి. ప్రతి యేటా వేసవిలో జరుగుతున్న అగ్గిప్రమాదాలతో కాలిన పండ్లతోటలకు నష్టంను అధికారులు అంచనా వేస్తున్నా పరిహారం అందిన దాఖలాలు లేవు. రైతులు వేసవిలో జాగ్రత్తలు పాటించి అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవల్సిన చర్యలను అనుముల ప్రాంతీయ ఉద్యానవన శాఖాధికారి మురళి అందిస్తున్న సూచనలు, సలహాలు ఆయన మాటల్లో..

జాగ్రత్తలు..

రైతులు మోటార్ల సర్వీసువైర్లు, కేబుల్ వైర్లు అతుకులు లేకుండా చూసుకోవాలి. నేల మీద వైర్లు లేకుండా చూసుకోవాలి.వేడిమికి షార్ట్‌సర్యూట్‌తో ఎండిన ఆకులు నిప్పంటుకుంటాయి.

- విద్యుత్ సర్వీసు వైర్లు, ఫ్యూజుల నుంచి స్టార్టరు వరకు గల వైరు నాసిరకంగా ఉంటే లోటల్టేజీతో వేడెక్కి కాలిపోయి మంటలు అంటుకుని వ్యాపించే అవకాశం ఉంది.
- స్టార్టర్ డబ్బాలు నేలపై అడ్డంగా ఉంచడం వల్ల ఎలుకలు దూరి వైర్లు కత్తిరించడం వల్ల షార్ట్‌సర్యూట్ జరిగి పక్కనే గల ఎండు ఆకులకు మంటలు అంటుకుంటాయి.
- తోటల్లో కరెంటు స్తంభాల మధ్య లూజ్ లైన్ లేకుండా చూసుకోవాలి. లూజ్‌లైన్ల వల్ల గాలిదుమారాలకు తీగలు ఒకదానికొకటి తగిలి నిప్పురవ్వలు నేలపైబడి కింది గడ్డికి అంటుకుంటాయి.
- తోటల్లో చెట్ల మధ్యలో వేసవికి ముందే దున్నుకోవాలి.కలుపు మందులు వాడితే ఎండిన గడ్డిని పీకి వేయాలి.
- ఎట్టి పరిస్థితుల్లో వేసవిలో తోటల్లో చెత్తకు నిప్పు పెట్టకూడదు.
- తోటల చుట్టూ జీవకంచె ఉంటే అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు మంటలు అదుపులో ఉండేందుకు కంచె మధ్యలో ఎడం ఉండేలా ఖాళీ స్థలం ఉంచుకోవాలి.
- తోట గెట్ల వెంట గడ్డి వాములు ఉంచకూడదు.
- అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తోటల్లో అంతరకృషి లేకుండా ఎండు గడ్డి బాగా ఉంటే డ్రిప్ లాటరల్ పైపులు కాలిపోయి తీవ్ర నష్టం జరుగుతుంది.